క్లుప్తంగా

సోషల్ మీడియాలో పోస్టు చేశాడని అరెస్ట్

తెనాలిరూరల్: సోషల్ మీడియాలో తమ పార్టీ అధినేతకు వ్యతిరేకంగా పోస్ట్ పెట్టాడని జనసేన నాయకుల ఫిర్యాదుతో ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బేతపూడికి చెందిన జాన్ మహబూబ్ సుభాని 2022లో జనసేనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీనిపై ఆ పార్టీ నాయకులు తెనాలి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహబూబ్ సుభానిని బుధవారం అరెస్ట్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చి నోటీసు ఇచ్చి పంపినట్టు సీఐ నిసార్‌బాషా తెలిపారు.

ప్రజ్ఞాచారికి ఎస్పీ అభినందన



తెనాలిరూరల్: మండల గ్రామం కొలకలూరుకు చెందిన సాహితీ రత్న డాక్టర్ నూతక్కి ప్రజ్ఞాచారిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సత్కరించి అభినందించారు. గుంటూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని ప్రజ్ఞాచారి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన చేస్తున్న సాహితీ సేవ గురించి తెలుసుకున్న ఎస్పీ శాలువాతో సత్కరించి అభినందించారు. ఏడు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడంపై హర్షం వ్యక్తం చేసి భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకోండి

కొల్లిపర: పాడి రైతులు పశుగ్రాసం సాగు కోసం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సాయిసతీష్‌రాజు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాడి పశువులతో పాటు బోరు నీటి సదుపాయం ఉండాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు అర్హులని, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండాలన్నారు. ఈ పథకం కింద పశుగ్రాసం సాగుకు రెండు సంవత్సరాలు పాటు ఖర్చు భరిస్తామన్నారు. రైతులు దరఖాస్తులను రైతు సేవ కేంద్రం, ఉపాధి పథకం వారికి అందించాలి.

అత్యంత వైభవంగా మందిర వార్షికోత్సవం



తెనాలి: స్థానిక సుల్తానాబాద్ ఆలపాటినగర్‌లోని శ్రీ సద్గురు సాయికుమార్ మందిరం 21వ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మందిర వార్షికోత్సవం సందర్భంగా బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామున అయిదు గంటలకు కాకడహారతితో పూజలను ప్రారంభించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలను బ్రహ్మశ్రీ పెగ్గళ్లపాటి సదాశివ శర్మ జరిపించారు. సుల్తానాబాద్, ఆలపాటినగర్, చెంచుపేట తదితర ప్రాంతాల్నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల చేతుల మీదుగాపంచామృతాలతో అభిషేకాలు చేయించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సాయిబాబాను దర్శించుకుని పూజ ల్లో పాల్గొన్నారు. భక్తిరంజనిలో భాగంగా వెంపటి సత్యనారాయణ ఆలపించిన భక్తిగీతాలు భక్తులను అలరించాయి. సహజకవి అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆలయ విశేషాలతో పాటు కార్యక్రమ వివరాలను కొత్త సుబ్రహ్మణ్యం, వెంపటి సత్యనారాయణ తెలియజేశారు. వార్షికోత్సవాలను తాళ్లూరి సాంబయ్య, నాగళ్ల మోహన్ కుమార్, మేలేటి ఉషారాణి పర్యవేక్షించారు. మధ్యాహ్నం నుండి అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతి కోలాట బృందంచే కోలాట ప్రదర్శన జరిగింది.

స్థానం పదిలం.. రచనలు సుస్థిరం

- విశిష్ట స్త్రీవాద రచయిత్రి సుజాత
- నేడు గుంటూరులో ఆచార్య ఎన్‌జీ రంగ సాహితీ పురస్కారం



'పచ్చబొట్టు'తో సి.సుజాత

తెనాలి: సాహిత్య సృజనలో విశిష్ట స్త్రీవాద రచయితగా తన స్థానాన్ని పదిలం చేసుకున్న సి.సుజాత ఆచార్య ఎన్‌జి రంగ సాహిత్య పురస్కారం అందుకోనున్నారు. ఆచార్య ఎన్‌జి రంగ ఫౌండేషన్ నిర్వహించిన నవలల పోటీలో సుజాత రచన 'పచ్చబొట్టు' నవలకు ద్వితీయ బహుమతి లభించింది. నేటి సాయంత్రం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై జరగనున్న ఎన్‌జి రంగ జయంతి వేడుకల్లో నగదు బహుమతితో సుజాతను సత్కరిస్తారు. ఈ సందర్భంగా రచయిత్రి పరిచయం.

భిన్నమైన ఇతివృత్తాలతో వాస్తవానికి దగ్గరగా సహజంగా ప్రవర్తించే పాత్రలతో రచనా వ్యాసంగం చేస్తున్న సుజాత స్వస్థలం తెనాలి. వ్యవసాయం, వ్యాపారం రెండూ నడిపే కుటుంబంలో 1955 డిసెంబరు 12న జన్మించారు. జేఎంజే మహిళా కాలేజీలో డిగ్రీ చదువుతుండగానే వివాహమైంది. ఇదే జిల్లాలోని యడ్లపాడు దగ్గర్లోని జగ్గాపురం వెళ్లారు. ఇల్లు దాటి, నాలుగ్గోడలు దాటి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టే అవకాశం, మరో కాలక్షేపం లేని ఆకాలంలో మొత్తంగా పుస్తకాలే నేస్తాలయ్యాయి. అలా తెలుగు సాహిత్యంలో దాదాపు ప్రతి పుస్తకాన్ని చదివారు. సాధారణ కుటుంబాల్లో వచ్చే ప్రతి అనుభవాన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చూడగలగటంతో సమాజంలో స్త్రీ స్థానం అట్టుడుగున పాతేసి వుందని తెలుసుకోగలిగారు.

జర్నలిస్టుగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో సబ్‌ఎడిటర్‌గా, హారతి మాసపత్రిక మేనేజింగ్ ఎడిటర్‌గా, స్నేహ, సెల్యూట్, రైతుసేవ పత్రికలకు ఎడిటర్‌గా, కళ్యాణమస్తు, సందడి డాట్‌కామ్‌లకు కంటెంట్ ఎడిటర్‌గా చేశారు. తర్వాత ఈటీవీలో 'సఖి', వనితా ఛానల్‌కు స్క్రిప్టురైటర్‌గా, డైరెక్టర్‌గా రెండువేలకు పైగా మహిళా కార్యక్రమాలను చేశారు. హెచ్‌ఎం టీవీలో ప్రోగ్రామింగ్ హెడ్‌గా, టీవీ7 హెల్త్ ఛానల్‌కు క్రియేటివ్ హెడ్‌గా చేశారు. ప్రస్తుతం సొంతూరులోనే నివసిస్తూ వనితా టీవీవారి వనితావాణి డాట్‌కామ్‌కు కంటెంట్ ఎడిటర్‌గా, మన తెలంగాణ పత్రికకు ప్రత్యేక కరస్పాండెంట్‌గా చేస్తున్నారు.

ఉద్యోగాలు చేస్తూనే రచనా వ్యాసంగం కొనసాగించిన సుజాత తొలి నవల 'సప్తభుజంగాలు'. అన్ని భాషల్లోకి అనువదింపదగిన పుస్తకంగా నేషనల్ బుక్ ట్రస్ట్ సిఫార్సు చేసింది. 199 ప్రపంచ పుస్తక ప్రదర్శనలో అన్ని భాషల్నుంచి ఎంపిక చేసిన 1100 పుస్తకాల్లో ఇదొటి, తర్వాత 'రాతిపూలు', 24/7 న్యూస్‌ఛానల్' నవలలు రాశారు. ఆమె రాసిన కథలు 'సుజాత కథలు', 'రెప్పపాటు ఉప్పెన', 'నెరుసు' పేర్లతో కథాసంపుటాలుగా వచ్చాయి. సుజాత కథల్లో చాలాభాగం ఇంగ్లిష్‌లోకి అనువాదమయ్యాయి. ఇండియన్ లిటరేచర్, ప్రతిభ, ఇండియా వంటి మేగజైన్లలో ప్రచురితమయ్యాయి. 'కథాకోకిల' పురస్కారం, విశిష్ట మహిళ పురస్కారం, ప్రతిభ పురస్కారం, డాక్టర్ పరుచూరి రాజారాం సాహితీ పురస్కారం, తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారం లభించాయి. లభించింది.

సుజాత రచనలన్నీ ఒకలాంటి ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్. ఆ రాతలు మనతో మాట్లాడతాయి. జీవితపు వాస్తవికతనూ, నిర్దాక్షిణ్యతనూ, మనుషుల మామూలుతనాన్నీ నగ్నంగా మనముందు ప్రదర్శిస్తాయి. స్పందన తెచ్చిపెట్టుకుని రాయటం, ఎప్పుడు రాయాలంటే అప్పుడు రాయగలగటం, రాతలకు, వ్యక్తిత్వానికి పొంతన లేకపోవటం ...ప్రొఫెషనల్ రచయిత లక్షణాలైతే, సుజాత ఆ కేటగిరీలోకి కచ్చితంగా రారు. తనకు తోచినపుడు, మనసు స్పందించినపుడు, భావోద్వేగాల సంచయం ఎగదోసినపుడు మాత్రమే రాసే రచయిత్రి సుజాత. ఎవరికోసమో తన ఆలోచనలను మార్చుకొని రాజీపడే గుణం ఆమెలో లేదని ఆమె రచనలు తెలియజేస్తాయి. అందుకే ఆమెను కొందరు 'కమ్యూనిస్టు' అన్నారు. మరికొందరు 'ఫెమినిస్టు' అన్నారు. నిజానికామె వాస్తవికవాది.

పచ్చబొట్టుకు అవార్డు

తాజా అవార్డు లభించిన 'పచ్చబొట్టు' నవల వ్యవస్థలో కులానికున్న ఆధిపత్య బలాన్ని ఎత్తిచూపుతుంది. తెలివితేటలతో ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా దళితుల్లో మరీముఖ్యంగా పేదలు, చొరవగా నలుగురితో కలిసిపోలేని వైనాన్ని, తాను చూసిన అంశాలతో ఈ నవలలో రాశారు. ముందు కులం...ఆ తర్వాతే మనుషులమన్న స్పృహ ఉంటుందన్న వాస్తవికతను చెప్పారు. 'నేను నమ్మింది, అనుభవించింది సూటిగా నా కథల్లో కనిపిస్తూనే ఉంటుంది' అంటారు సుజాత. 'నేను అమితంగా, వెర్రిగా ప్రేమించే నాతోటి ఆడవాళ్లందరూ నాకు ఆప్తులనే ఊహతో, ఆశతో నేనుచాలా సంతృప్తురాలిని... స్త్రీవాదం అంటూ వస్తుందనీ, నేను రాసే కథలతో ఫెమినిస్టు రైటర్‌గా గుర్తింపు రావటం గొప్ప సంతోషం' అన్నారు. గొప్ప రచయితలు, కళాకారులు పుట్టిన తెనాలిలో పుట్టటం, తన ఉనికి సాహిత్యంలో ఏమూలనైనా కాస్త మెరవటంతో జన్మసాఫల్యమైంది అంటారు. వీటిన్నింటికీ మించి స్త్రీనై పుట్టినందుకు మరింత గర్విస్తున్నానని చెబుతారు సుజాత.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను వృద్ధి చేసుకోండి



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సుబ్రమణ్యం, పురుషోత్తం

తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం సూచించారు. ఐటీఐ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బుధవారం చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో టెక్నికల్ విద్యకు అధిక ప్రాధాన్యం ఉందని చెప్పారు. ఎంచుకున్న వృత్తిలో రాణించాలని సూచించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 జులైలో జరిగిన పరీక్షల్లో 243 మంది పరీక్షలు రాశారని, వారందరూ ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఎలక్ట్రిషన్ ట్రేడ్‌లో 1200 మార్కులకు 1148 మార్కులు టి.అభిలాష్ సాధించి ఐటీఐ కళాశాల టాపర్‌గా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో మారుతీ, సుజికి షోరూం హెచ్‌ఆర్ మేనేజర్ జి.పురుషోత్తం, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పాత రత్నాటాకీస్ నుంచి శివాజీ బొమ్మ సెంటర్ వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలు రోడ్లు, కాల్వలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. 130 మీటర్ల ఎక్స్‌టెన్షన్ సీసీ రోడ్డును రూ.20.5 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ ఎ.శ్రీనివాసరావు, ఎఈ సూరిబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు లేకుండా చూండి...

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 5,6 వార్డులలో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు పారుదల జరిగే విధంగా చూడాలన్నారు. వ్యర్థాల నిర్వహణపై ప్రజలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే సమస్యను అధిగమించవచ్చన్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు తోట రఘురామ్, కొత్రపాటి లక్ష్మి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, తదితరులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు జరగాలి

రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్



తెనాలిఅర్బన్: నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన తెనాలి పట్టణంలో పర్యటించారు. గత ఏడాది నిర్మించిన భవనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే పలు సచివాలయాలను తనిఖీ చేసి అక్కడ ఇంటి ప్లాన్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా తెనాలి వచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట ఏసీపీ శ్రీమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



తెనాలి: వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నాజరుపేటలోని విద్యా శంకర భారతి నృసింహ సదనంలో లోకహితం కోసం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు సమాఖ్య కోశాధికారి సీఎంకే తిరుమలరావు, కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ స్మార్త ఆగమ శాస్త్ర పండితుడు, పంచాంగ పరిష్కర్త వాస్తు జ్యోతిష్య పండితుడు బ్రహ్మశ్రీ రాంపల్లి ప్రసాద్ శర్మ తమ శిష్య బృందంతో హోమ క్రతువును చేశారు. తదనంతరం శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపి సత్యదేవ వ్రతాన్ని నిర్వహించారు. సమాఖ్య ప్రతినిధులు భాగవతుల కామేశ్వరరావు, కేవీ సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసమూర్తి, మేళ్లచెరువు అనిల్‌కుమార్, టి.ఆంజనేయులు, పోలేపెద్ది రామకృష్ణ, తాడేపల్లి నాగసుబ్రహ్మణ్యం, బుర్ర ప్రభాకరశర్మ, నందివెలుగు విజయసారథి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాప్రసాద వినియోగం చేశారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ఏడీఏ సునీత



రైతులకు సూచనలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ సునీత

తెనాలిరూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, జీవ ఎరువులు వాడాలని సూచించారు. రైతులందరూ ఈకేవైసీఈ నమోదు చేయించుకుని, ఈ–పంటలో వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. లాంఫాం ప్రధాన శాస్త్రవేత్త రత్నం మాట్లాడుతూ ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడపీడలు, నాము తెగులును గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వరిలో వచ్చే దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రిఫ్లూమిజోపైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యూరాన్‌లలో ఏదైనా వాడవచ్చని సూచించారు. ఎండల నుంచి రక్షణ కోసం లీటరు నీటిలో నాలుగు గ్రాముల గంధకాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఆకు నల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్, కానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్‌లలో ఏదైనా వాడవచ్చని తెలిపారు. వరి ఆకుల మీద, వెన్ను మెడ భాగాల మీద, ఆకులపై నూలు కండె ఆకారం కలిగిన గోధుమ రంగు అంచులు గల మచ్చలు కనబడితే ట్రై సైక్లోజోల్‌ను వినియోగించాలన్నారు. వీఏఏలు, వ్యవసాయాధికారులు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర మల్లఖంబ్ పోటీలకు తెనాలి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు

తెనాలి: కర్లపాలెం మండలం చింతాయపాలెంలో మంగళవారం జరిగిన మల్లఖంబ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. తమ విద్యార్థులు ఆరుగురు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీలకు అర్హత సాధించారని హైస్కూలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు చెప్పారు. అండర్–19 బాలికల విభాగంలో షేక్ సుహానా (9వ తరగతి), బాలుర విభాగంలో కె.శివయ్య (9వ తరగతి), అండర్–17 బాలికల విభాగంలో వర్షిత ప్రియ (9వ తరగతి), బాలుర విభాగంలో బాణావత్ ఇంద్ర నాయక్ (9వ తరగతి), అండర్–14 బాలికల విభాగంలో పావని శ్రీవిద్య (ఆరవ తరగతి), బాలుర విభాగంలో దమ్ము నాగచైతన్య (8వ తరగతి) ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 9న జరగనున్న రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డీడీఏ విజయ నిర్మల

కర్లపాలెం: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించటం వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ డెప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మళ చెప్పారు. బుధవారం ఏఓ సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పెదగొల్లపాలెం, సమ్మెటవారిపాలెం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో డీడీఏ విజయనిర్మల, ఏడీఏ లక్ష్మి పాల్గొన్నారు. డీడీఏ విజయనిర్మల మాట్లాడుతూ పైర్లకు ఆశించే చీడపీడల నివారణకు వ్యవసాయాధికారులు సూచించే మందులు తగిన మోతాదులో మాత్రమే వేయటం వలన పైరుకు మేలు జరుగుతుందని చెప్పారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పేటేరులో 'పొలం పిలుస్తోంది'

రేపల్లె రూరల్: రైతులు నిరంతరం తమ సాగుభూమిలోని వరిపైరును పరిశీలిస్తు ఉండాలని, ఏ మాత్రం అజాగ్రత్త వహించినా మూల్యం చెల్లించుకోకతప్పదని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు సూచించారు. మండలంలోని పేటేరు–1, 2 గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు.14,15 వార్డులలో బుధవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంకు వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి వెంటనే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువులతో సమస్య



స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్‌కు పడమరవైపు రహదారి చిత్రమిది. వాహనాలు, ఆవులతో రోడ్డు రాకపోకలకు అవకాశం లేకుండా తయారైంది. అక్కడ ఒకవైపు చేపల దుకాణాలు నడుస్తుంటాయి. మరోవైపు అనుబంధ అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ కారణంగా రహదారి మార్గం కుంచించుకుపోయింది. అన్న క్యాంటీన్ పక్క నుండి ఈ రోడ్డులోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మించారు. అటు నుండి వెళ్లేందుకు వాహనాలు, నిత్యం సంచరిస్తుండే ఆవులు, పందులతో దుర్భేద్యంగా తయారైంది. మరోవైపు దుర్గంధంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే కనిపిస్తున్న ఈ సమస్యను పరిష్కరించకపోతే ఎలాగని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. - తెనాలి

కోతల సమయం.. జాగ్రత్త అవసరం

- యంత్రాలతో వరి కోతలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- వరి కోత యంత్రాలతో ఖర్చు, సమయం ఆదా
- యంత్రాల వైపే మొగ్గు చూపుతున్న రైతులు
- మరో 15 రోజులలో కోతలు



కొల్లిపర మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

కొల్లిపర: మరో 15 రోజుల్లో వరి కోతల సమయం ...వరి కోతలు సమయంలో కూలీలు కొరత లేదా అధిక ఖర్చు వలన రైతులు ఇప్పుడంతా హార్వెస్టర్‌లతో వరి కోతలు గంటల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు. వరి గింజ కూడా కిందకు పోయకుండానే.. ధాన్యం నేరుగా మార్కెట్‌కు తరలించే విధంగా రైతులు సిద్ధపడుతున్నారు. అయితే హార్వెస్టర్ వినియోగించే సమయంలో రైతులు, యజమానులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా నష్టపోవాల్సి వస్తోందని, అందుకే యంత్రాలతో వరి కోతలు సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో పంట ఇలా....

నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలంలో అత్యధికంగా పండించే పంటలల్లో వరి పంట ఒకటి. ఈ రబీ సీజన్‌లో సుమారుగా 27 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. తెనాలిలో 13,533 , కొల్లిపరలో 12,482 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరి కోస్తే సమయం ఆదా అవుతోంది.
- ఒడ్డు, గట్టు చుట్టూ వరి చేతితో కోయడం వల్ల ఎకరానికి పది నిమిషాల సమయం కలసి వస్తుంది.
- ఒక మడి నుంచి మరొక మడికి వెళ్లేందుకు ముందుగా మంచి బాటా తీస్తే హార్వేస్టర్ సులువుగా వెళ్తుంది. దీంతో సమయం ఆదాతో పాటు వడ్లు చెడిపోయే అవకాశం ఉండదు.
- పచ్చిగా ఉన్న వరి కోయడం వల్ల సమయం ఎక్కువగా పడుతుంది. అదేవిధంగా వడ్లు కూడా మట్టిలో పోయే అవకాశం ఉంటుంది.
- పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే గుర్తిస్తే కోత సమయంలో మిషన్ బ్లేడ్ విరిగి నష్టం వాటిల్లకుండా ఉంటుంది.
- తప్పనిసరిగా హార్వెస్టర్‌కు డ్రైవర్‌తో పాటు అతనికి తోడుగా మరొకరిని సహాయకుడిగా పంపించాలి.
- విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే హార్వెస్టర్‌ను వెళ్లానివ్వాలి.
- వరి పంట నేలకు ఆనుకున్న సమయంలో హార్వెస్టర్‌తో కాకుండా కూలీలు చేత కోత కోయించాలి
- వడ్లు నిల్వ ఉంచుకునే రైతులు హార్వెస్టర్‌తో వేసిన వెంటనే తేమ లేని ప్రదేశంలో వడ్లు ఆరబోసి పూర్తిగా డ్రై అయిన తరువాత నిల్వ చేసుకోవాలి.
- వాతవరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి గింజల్లో తేమ లేదు అనుకున్న సమయంలో మాత్రమే మిషన్ ద్వారా కోత కోయించాలి
- గింజలో తేమ ఉన్న సమయంలో మిషన్ ద్వారా కోత నిర్వహిస్తే వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు కోతలు నిర్వహిస్తే గింజలల్లో తేమ శాతం ఉంది. వరి గింజలు బూజు పట్టి పాడైపోతాయి.

రీసర్వేకు సహకరించండి

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏపీ అర్బన్ రీసర్వే పథకంలో భాగంగా పట్టణ పరిధిలో రీసర్వే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దస్తావేజులు, రికార్డుల ప త్రాలు సిబ్బందికి చూపించి సర్వేను విజయవంతం చేయాలన్నారు.